www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 30 జులై 2024

1నే పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్టు ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండో తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎంపిడిఒలతో పింఛన్ల పంపిణీపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల సొమ్మును ఈ నెల 31న డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టాలని కలెక్టర్ స్పష్టంచేశారు. జిల్లాలో ఈ నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో అక్కడక్కడా సమస్యలు ఏర్పడ్డాయని, వాటిని అధిగమించి వచ్చే నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతు కంట కన్నీరు..!

ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామంలో ఇంకా ముంపులోనే ఉన్న పంటపొలాలు

- వారం రోజులుగా ముంపులోనే పొలాలు
- రెండు జిల్లాల్లో 33 వేల ఎకరాల్లో నాట్లు, 1700 ఎకరాల్లో నారుమళ్లు మునక
- పశ్చిమలో అత్యధికంగా 30 వేల ఎకరాల్లో ముంపులోనే నాట్లు
- ఎకరాకు రూ.15 వేలు వరకూ అన్నదాతకు నష్టం
- కౌలురైతులకు నష్ట పరిహారం అందించేనా?
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగులో ఆదిలోనే అన్నదాతను కష్టాలు చుట్టుముట్టాయి. వరదలకు నాట్లు నాటిన పొలాలు, నారుమడులు నీట మునిగి దెబ్బతినడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా పొలాలు ముంపులోనే ఉండటంతో పూర్తిస్థాయిలో దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో ఖరీఫ్ సాగు ఆదిలోనే నష్టాలను మిగిల్చింది. వరదలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీగా పంటనష్టం వాటిల్లింది. వరద తగ్గుముఖం పట్టినా ఇంకా ముంపులోనే పొలాలు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 29,505 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురవ్వగా, 1450 ఎకరాల్లోని నారుమళ్లు నీట మునిగాయి. ఏలూరు జిల్లాలో 3,442 ఎకరాల్లో నాట్లు, 245 ఎకరాల్లో నారుమడులు ముంపులోనే నానుతున్నాయి. దుక్కు, విత్తనాలు, నాట్లు నాటిన కూలీల ఖర్చు ఇలా ఎకరాకు రూ.15 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. రెండెకరాలు సాగు చేసిన రైతుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు, నాలుగెకరాలు సాగు చేసిన రైతుకు రూ.60 వేల నుంచి రూ.70 వేలు వరకూ నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఆదిలోనే పంట పొలాలు మునిగి దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గోదావరి వరద కొంత తగ్గుముఖం పడుతోంది. పూర్తిస్థాయిలో వరద నీరు తగ్గడానికి మరో నాలుగు రోజులు పట్టే పరిస్థితి ఉంది. ముంపులోని పొలాలు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడటంతో ఖరీఫ్ సాగును ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలో రైతులకు అర్థం కావడం లేదు. తిరిగి నారుమడులు వేసి నాట్లు నాటేందుకు దాదాపు మరో నెలరోజులు పట్టే అవకాశం ఉంది. ఆగస్టు నెలలోనూ వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. మరోసారి వరదలు వస్తే పరిస్థితి ఏమిటనే భయం రైతులను వెంటాడుతోంది. ఉంగుటూరు మండలం కాకర్లమూడిలో వరద నీరుకు నారుమడులు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ముంపులోనే ఉన్నాయి. వరద తగ్గిన ప్రాంతాల్లో మరోసారి నారుమడులు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నాట్లు, నారుమడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందా అనే అనుమానం సైతం నెలకొంది. 33 శాతం పంట దెబ్బతింటే తప్ప పరిహారం ఇవ్వడం లేదు. నాట్లు, నారుమడులకు సంబంధించి నష్టపరిహారం ఏవిధంగా లెక్కిస్తారో తెలియని పరిస్థితి ఉంది. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతంలో పంట నష్టం ఎక్కువగా ఉంది. ఒకవైపు గోదావరి, మరోవైపు ఎర్రకాలువ, ఇంకోవైపు గోస్తనీ వరదలతో భారీగా పొలాలు ముంపునకు గురయ్యాయి.

కౌలురైతులకు పంట నష్టపరిహారం అందేనా..?

రెండు జిల్లాల్లో ఖరీఫ్ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. వరదలకు పంట నష్టపోయిన వారిలో అత్యధికంగా కౌలురైతులే ఉన్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు పంట నష్టపరిహారం అందేనా అనే అనుమానాలు నెలకొన్నాయి. కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఆలస్యం కావడంతో రెండు జిల్లాల్లో ఇప్పటికీ కార్డుల జారీ సక్రమంగా జరగలేదు. పంట నష్ట పరిహారంలో కౌలుకార్డులు ప్రధానంగా పరిగణిస్తే కౌలురైతుల పరిస్థితి ఏమిటనే చర్చ రైతుల్లో నెలకొంది. ఎకరాకు రూ.15 వేలకుపైగా నష్టపోయిన కౌలురైతులకు పరిహారం ఇవ్వకపోతే ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఉంది. దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ నారుమడులు వేసి ఖరీఫ్ సాగు చేయాలంటే అదనపు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. దీంతో కౌలురైతులు రెండు విధాలుగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకుంటేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రతియేటా దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిహారం, బీమా వంటి ఏ ఒక్కటీ కౌలురైతులకు అందడం లేదు. కూటమి ప్రభుత్వమైనా కౌలురైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ముంపులోనే రహదారులు

వరద ముంపు నుంచి బయటపడ్డ కుక్కునూరు ప్రధాన రహదారి

ప్రజాశక్తి - కుక్కునూరు

గత 12 రోజులుగా తగ్గుతూ పెరుగుతూ కొనసాగిన గోదావరి వరద ఉధృతి ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో 54 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరికను దాటి ఉప్పొంగిన గోదావరి సోమవారం 43 అడుగులకు చేరింది. దీంతో మూడు, రెండో ప్రమాద హెచ్చరికలను అధికారులు ఉపసంహరించారు. గోదావరి వరద ఉధృతి తగ్గడంతో భద్రాచలం నుండి కుక్కునూరుకు రాకపోకలు యధావిధిగా సాగాయి. వరద తగ్గుముఖం పట్టినా దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం మధ్య ఉన్న కాజ్‌వేలు ఇంకా ముంపు నుంచి బయటపడలేదు. దీంతో ఇప్పటికీ 12 రోజులుగా 19 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, వ్యాపారులు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో సీతారామనగరం-వేలేరు, వెంకటాపురం-వెంకటాపురం ఎస్‌సి కాలనీ మధ్య రహదారులపై వరద నీరు తగ్గడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు వరద తగ్గుముఖం పట్టడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.337 మీటర్లకు చేరుకుందని, 12,25,430 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.560 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.420 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టుకి వెళ్లే ప్రధాన మార్గమైన కడెమ్మ వంతెన ముంపు నుంచి బయటపడింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతుల నడ్డి విరిచేలా ఉందని ఎద్దేవా చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి, నేతలు చిట్టిబొమ్మ కొండలరావు, నేతలు, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నేతలు, రైతులు

'మీకోసం'లో 211 అర్జీలు స్వీకరణ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా స్వీకరిస్తున్న ప్రజల అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ముక్కంటి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజుతో కలిసి ఆమె ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 211 అర్జీలు స్వీకరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల ప్రభుత్వ శాఖల పరంగా సమస్యలుంటే తక్షణమే వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీదారుల సమస్య పరిష్కారంలో అధికారులు నాణ్యతతోకూడిన పరిష్కారాన్ని చూపాలన్నారు. అర్జీలు స్వీకరించినప్పటి నుండి ప్రభుత్వం ఇచ్చిన సమయంలో వాటి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం పేరంపేటకు చెందిన గోలి నర్సిరెడ్డి మే 24న తాను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించానని, నేటి వరకూ ధాన్యం సొమ్ము రాలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజరును ఆదేశించారు. ద్వారకాతిరుమలకు చెందిన పూర్తి విభిన్న ప్రతిభావంతుడు కొండూరు సాయికృష్ణ తనకు 2014 వరకు పెన్షన్ అందిందని, అనంతరం ఆధార్ లేని కారణంగా పెన్షన్ ఆపివేశారని వాపోయాడు. తన చేతి వేలిముద్రలు, ఐరిష్ పడకపోవడంతో పెన్షన్ ఆపివేశారని, తనకు పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్ కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ సమస్యను పరిష్కరించి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్షణం పెన్షన్ అందించేలా చూడాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశిస్తున్న కలెక్టర్

జెసిచే 'మీకోసం' ప్రక్రియ పరిశీలన

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. సోమవారం గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ కౌంటర్, అర్జీదారుల దరఖాస్తు నమోదు, అర్జీదారులు వేచి ఉండే ప్రదేశం, తాగునీరు, మెడికల్ కౌంటర్, వీల్‌ఛైర్స్ తదితర వాటిని పరిశీలించారు. అర్జీదారులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా కలెక్టరేట్ సిబ్బంది విధులు నిర్వహించాలని జెసి ఆదేశించారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ముక్కంటి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

జిల్లాలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం 'మీకోసం'లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి రైతులు, కౌలురైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొద్దిసేపు జిల్లాలో రైతుల సమస్యలపై నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేసి రైతులకు, కౌలురైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలన్నారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. చింతలపూడి ఎత్తిపోతల, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. మొక్కజొన్న సీడ్ పంట సాగు చేస్తున్న విత్తన రైతులకు కంపెనీల నుండి అగ్రిమెంట్స్ ఇప్పించాలన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకా తిరుమల, దెందులూరు మండలాలకు సాగునీరు అందించాలని కోరారు. కృష్ణా, గోదావరి డెల్టాల పరిధిలో పంట కాలువలు బాగు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దొండ పందిళ్లు, ఆయిల్ పామ్ మొక్కలు, ఇతర ఉద్యాన పంటలకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నేతలు

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధానం పూర్తి పారదర్శకతతో అమలు కావాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 24 గంటలూ పని చేసేలా సీసీ కెమెరాలు, సిబ్బంది తప్పనిసరిగా ఉండాలన్నారు. సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించాలని, స్టాక్‌పాయింట్‌లో ప్రతిరోజూ ఉదయం ప్రారంభం నిల్వ, ఆ రోజు సరఫరా చేసింది, నిల్వ వివరాలతో పకడ్బందీగా రికార్డులు నిర్వహించాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, నిర్దేశిత ధరల కంటే అధికంగా వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్టాక్ పాయింట్ నుండి బయటకు వచ్చిన వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డుల్లోగాని, ఇసుక పరిమాణంలోగాని తేడాలుంటే వెంటనే విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. గనుల శాఖాధికారులు సంబంధిత తహశీల్దార్లు ప్రతిరోజూ తప్పనిసరిగా ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించి, రికార్డుల్లో సంతకాలు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమంగా తరలిస్తే సంబంధిత అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ బృందం నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఎం.ముక్కంటి, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రవికుమార్, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, డిఆర్‌డిఎ పీడీ కె.విజయరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని తమకున్న సొమ్మును తామే పోగొట్టుకునే పరిస్థితులు తెచ్చుకోరాదని, అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించరాదని, ఏవైనా సమస్యలుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఎస్‌పి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వృద్ధుల వద్దకు ఆయనే స్వయంగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణం వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

లిక్కర్ షాప్ మార్చాలని మీకోసంలో ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెంకు చెందిన ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల స్కూలు పిల్లలు, విద్యార్థులు, రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని మీకోసంలో ఫిర్యాదు అందింది. నల్లమాడు వెళ్లే దారిలో ఓ ప్రయివేటు పాఠశాలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణం వల్ల నల్లమాడు, యర్రమిల్లిపాడు, కంసాలిగుంట వెళ్లే ప్రజలు, రైతులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గొల్లగూడెంకు చెందిన నక్కా మదన్‌మోహన్ సోమవారం మీకోసం కార్యక్రమం ఏలూరులో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ప్రజా పరిష్కార వ్యవస్థకు 16 అర్జీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి 16 అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ భవాని శంకరి తెలిపారు. నూజివీడు మండలానికి పది అర్జీలు, చాట్రాయి మండలానికి ఒక అర్జీ, ముసునూరు మండలానికి ఐదు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.

ఐటిడిఎ కార్యాలయాన్ని ఎంఎల్‌ఎ ఆకస్మిక తనిఖీ

డివైఇఒ సాయి కుమార్‌పై ఆగ్రహం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

ఐటిడిఎ రామ నర్సాపూరం మెడికల్ క్యాంపుకి వెళ్తున్న పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఆకస్మికంగా ఐటిడిఎ కార్యలయాన్ని పర్యవేక్షించారు. తనిఖీలో భాగంగా డివైఇఒ సాయి కుమార్ విధులను దుర్వినియోగం చేస్తూ ఆఫీస్‌లో పబ్జి గేమ్ ఆడడం చూసి ఆగ్రహించారు. వెంటనే సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారిచేశారు.

6,018 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 6,018 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు సోమవారం తెలిపారు. ఈ ఏడాది జూన్ 14 నుంచి ఇప్పటి వరకూ 8.6220 టిఎంసిల నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేసినట్లు డిఇ తెలిపారు. గోదావరి నీటిమట్టం 24.153 మీటర్లకు పైబడి ఉందని 17 మోటార్లు 17 పంపులతో నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నిర్వాసితులు దళారులను నమ్మి మోసపోవద్దు

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి: నిర్వాసితులకు కేటాయించిన భూములను దళారులకు ఇచ్చి మోసపోవద్దని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. సోమవారం కోరుటూరు గ్రామానికి చెందిన పలువురు నిర్వాసితులు ఆయన్ని కలిశారు. గతంలో కొంతమందికి భూమికి భూమి ఇచ్చారని, అయితే వారికి సరిహద్దులు చూపలేదని అన్నారు. దీంతో స్థానిక గిరిజనులకు నిర్వాసితుల మధ్య గొడవలు జరుగుతున్నాయని వాపోయారు. అదేవిధంగా కొన్ని గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు కాలేదని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా నిర్వాసితులకు కేటాయించిన భూమికి భూమిని దళారులకు తక్కువ కౌలుకి ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ఆర్ అండ్ ఆర్ భూములలో మిగులు భూమి ఎంత ఉందో సర్వే చేసి అర్హులైన నిర్వాసితులకు కేటాయిస్తామని తెలిపారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బాలరాజు

నిరాశ్రయులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వేలేరుపాడు మండలంలో వరదల కారణంగా నిరాశ్రయులైన తాకురగొమ్ము, కన్నయ్య కోట గ్రామాల్లోని వరద బాధితులకు కలెక్టర్ ఆదేశాలతో రెడ్ క్రాస్ వాలంటీర్లు సోమవారం టార్పాలిన్లు, కిచెన్ సెట్లను, సబ్బులు, పేస్టు బ్రష్‌లతో కూడిన హైజిన్ కిట్లను పంపిణీ చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గోదావరి నది వరద ప్రభావిత ప్రాంతాలైన తాకురగొమ్ము, కన్నయ్య కోట గ్రామాలలోని 90 కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వేలేరుపాడు తహశీల్దార్ జి.చిన్నారావు, విఆర్‌ఒలు, రెడ్‌క్రాస్ వాలంటీర్లు కె.శ్రీనివాస్, పి.సునీల్, ఎస్‌వి.శ్రీనివాస్, సాయి ప్రవీణ్ పాల్గొన్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టుతో రైతులకు ఎంతో లాభం

ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి తమ్మిలేరు ప్రాజెక్టు వల్ల 4 వేల ఎకరాలు పంటసాగుకి నీరు అందుతుందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు జలాశయం ఎడమ కాలువ ద్వారా రైతులకు పంట నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మిలేరు జలాశయం మంచి ప్రాజెక్ట్‌కు సహకరించిన అందరకీ కృతజ్ఞతలు తెలిపారు. ఎడమ కెనాల్ కాలువ కరంపల్లి, ఎండపల్లి, కళ్యాణ పాడు, లింగపాలెం, తోచిలక, రాయుడుపాలెం మీదుగా 11.985 కిలోమీటర్లు ఉందని అన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందని, టూరిజం మంత్రితో నిధుల గురించి మాట్లాడడం జరిగిందని, కేంద్రం సహాయంతో నిధులు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నియమ నిబంధనలు అమలు చేయాలి

తహశీల్దార్‌కు ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - ముసునూరు

గతంలో పాఠశాలలో ఉన్న నియమ నిబంధనలు అమలు చేయాలని ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవికి మండల ఉపాధ్యాయ సంఘం సభ్యులు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జోహార్ బాజీ, ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, మండల విద్యాశాఖ అధికారి బివిఎస్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గాంగేయుడు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థి అక్కడే చదవాలని, హైస్కూల్ స్థాయిలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకూ అదే పాఠశాలలో చదువుతూ, తెలుగు, ఇంగ్లీషు రెండు భాషలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. హైస్కూల్ స్థాయిలో నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులను ఫిల్ చేయాలని, వ్యాయామ ఉపాధ్యాయులను కూడా ఫిల్ చేయాలని, ఉపాధ్యాయ సిబ్బందికి పాఠాలు చెప్పే విధంగా ఇప్పటి వరకూ ఉన్న పాఠశాలల్లోని కొన్ని కార్యక్రమాలను రద్దుచేసి, విద్యార్థిపై దృష్టి సారించి చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇలా పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. వినతిని అందజేసిన వారిలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, గౌరవాధ్యక్షులు సిహెచ్.జాకబ్ రాజు, సహఅధ్యక్షులు జి.రాంబాబు, వాణి, రత్నమాల ఉన్నారు.

వరదల్లోనే విద్యుత్ శాఖ మరమ్మతులు

వేలేరుపాడురూరల్: గోదావరి వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లను వరద తగ్గుముఖం పడుతుండడంతో ఎస్ఇ సాల్మన్ రాజ్ ఆదేశాల మేర వరద నీటిలోనే పడవలపై వెళ్లి మరమ్మతులు చేపట్టడం జరుగుతుంది. ఈ విధంగా సోమవారం చిగురుమామిడి నుంచి ఎడవల్లి వెళ్లే 11 కెవి లైన్ పెట్రోలింగ్ వర్క్ ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం ఇఇ రాధాకృష్ణ నేతృత్వంలో సిబ్బంది, గోదావరి వరద నీటిలోనే పడవలపై లైన్ల మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికే వరదల కారణంగా గత 15 రోజుల నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సంగతి అందరికీ తెలిసిందే.

పింఛన్ల పంపిణీకి చర్యలు

చింతలపూడి : పింఛను అమౌంటు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయవలసి ఉంటుందని చింతలపూడి ఎంపిడిఒ చిన్న రాట్నాలు తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి రూరల్‌కు సంబంధించి 21 గ్రామ సచివాలయాలకు సంబంధించి 9,532 మంది పింఛనుదారులకు రూ.4,0[illegible]72,2500 విడుదల అయినట్లు తెలిపారు. సదరు పింఛను అమౌంటు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయబడుతుందని తెలిపారు.

పాఠశాలలో విద్యాకిట్ల పంపిణీ

ఏలూరు సిటీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పటిష్ట పునాదులు వేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని, ఆ దిశగా అనేక చర్యలు చేపడుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు 35వ డివిజన్‌లోని విమలాదేవి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, షూస్, బెల్టు, యూనీఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంఎల్ఎను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జి అలజంగి శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సి.నారాయణరెడ్డికి నివాళులు

కామవరపుకోట: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయిత, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతికి ఎపి ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ టివిఎస్ రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ రెడ్డి ఘన నివాళులర్పించారు. సినీ గేయాలతో పాటు అనేక గజల్స్ రచించి, యువతరాన్ని ఉత్తేజపరిచి, సామాజిక చైతన్యం కోసం దేశంలో గల కళాకారులకు, సాహిత్య ప్రియులకు చక్కని సందేశం అందించిన నారాయణరెడ్డి అని కొనియాడారు. ప్రముఖ బుర్రకథ కళాకారులు మండవల్లి ప్రేమానందం, విభూతి రాజేశ్వరి, ప్రముఖ కోలాట కళాకారులు బొందలపాటి పద్మావతి, బుర్రకథ కళాకారుడు పక్షి నందకుమార్, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట లక్ష్మీనారాయణ ఘన నివాళులర్పించారు.

గోదావరి ఇసుక సరఫరా చేయాలని వినతి

జంగారెడ్డిగూడెం టౌన్: జంగారెడ్డిగూడెం డివిజన్‌కు గోదావరి ఇసుకను సరఫరా చేయాలని, గోదావరి ఇసుకను, స్థానిక వాగులలో ఇసుకను తోడుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నామని, అన్ని ప్రాంతాల నుంచి ఇసుక తీసుకు వెళ్లవచ్చని సిఎం ప్రకటించారు కానీ దీనికి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఐఎఫ్‌టియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎఒ ఎం.సోమేశ్వర రావుకి వినతిపత్రం అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చాట్రాయి: పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండలంలోని చనుబండ గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శర్మిష్ఠ అన్నారు. గ్రామంలోని కురుమ బజారులో జ్వరాలు, కాళ్ల నొప్పులు కీళ్ల నొప్పులతో గత కొంతకాలంగా బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించడం జరుగుతుంది. వైద్య శిబిరాన్ని సందర్శించి వ్యాధిగ్రస్తులకు సూచనలు సలహాలు అందజేశారు.

అల్లంచర్ల రైతులకు న్యాయం చేయాలని వినతి

టి.నరసాపురం : మండలంలోని అల్లంచర్ల 70 సర్వే నెంబర్ భూములు గల రైతులకు న్యాయం చేయాలని కోరుతూ అల్లంచర్ల సర్పంచి ఆధ్వర్యంలో సోమవారం బాధిత రైతులతో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో డిటి ఉదయ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అల్లంచర్ల పంచాయితీ పరిధిలో ఉన్న 70 సర్వే నెంబరులో ఉన్న 122 ఎకరాల భూమిలో 2009లో అప్పటి ప్రభుత్వం స్థానికంగా ఉన్న పేదలకు 50 సెంట్లు చొప్పున పంపిణీ చేశారని, పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్ కూడా చేశారని, ప్రభుత్వం ద్వారా రైతు భరోసా కూడా రైతులకు వస్తుందన్నారు. అయితే ఆ భూముల్లో 50 ఎకరాల వరకు కొందరు ఆక్రమించారని వెంటనే అధికారులు స్పందించి భూమిని సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టెలిఫోన్ ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌లో మంటలు

అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

ఏలూరు స్పోర్ట్స్ : జనసంచారమైన ప్రాంతంలో ఒక్కసారిగా టెలిఫోన్ ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌లో మంటలు చెల్లడంతో వెంటనే స్పందించిన ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. వివరాల్లోకెళితే.. జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చే మార్గమధ్యంలో నగరపాలక సంస్థ వీధిలైట్లను ఏర్పాటు చేసింది. ఆ వీధిలైట్లకు ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను ఆ సంస్థకు చెందినవారు అటుగా నడిపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 7 గంటల 40 నిమిషాల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఈ సమాచారాన్ని ఫైర్‌స్టేషన్ సిబ్బందికి అందించడంతో స్పందించిన ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎక్కువ జనసంచారం గల ప్రదేశం కావడంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలు, వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపుచేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

10 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలి

జంగారెడ్డిగూడెం టౌన్: గురవాయిగూడెం గ్రామంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానంకు దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలపై సదరు దేవాలయానికి దేవదాయ ధర్మదాయ శాఖ వారు సెక్షన్ 43(10) ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్, హిందూ రెలిజియస్ ఇన్స్టిట్యూషన్స్, ఎండోమెంట్స్ (దేవదాయ ధర్మదాయ) చట్టము నెం.30/1987 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుటకు ప్రతిపాదించడమైంది. సెక్షన్ 43(10) రిజిస్ట్రేషన్ నిమిత్తం ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉంటే ఈ ప్రకటన ఇచ్చిన 10 రోజులలో లిఖిత పూర్వకంగా జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి ఏలూరు జిల్లా వారికి తెలియజేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మహిషాసుర మర్దిని ఆలయం తనిఖీ

నూజివీడు టౌన్ : ఎండోమెంట్ కాకినాడ డిప్యూటీ కమిషనర్ విజయరాజు నూజివీడులోని కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన దేవాలయ కార్యనిర్వాహణ అధికారుల్ని పలు వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

కామవరపుకోట: ఈనెల 30, 31వ తేదీల్లో కామవరపుకోటలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణలు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, కూలీరేట్ల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం ఈ సమావేశాల్లో చర్చించి కర్తవ్యాలు రూపొందించనున్నామని, ఈ సమావేశాల జయప్రదానికి వ్యాపారవేత్తలు, రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, విద్యాసంస్థలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలకు అండగా జనసేన

నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం సందడి వాతావరణంలో కొనసాగుతుంది. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణి బాబు సూచనల మేరకు నూజివీడు పట్టణ నాయకులు తోట వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణవాసులు ఉత్సాహంగా ముందుకు వచ్చారని, 5వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ శాఖ ఎఇ పేర్ని రవికుమార్

చిట్‌చాట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఈ క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ముదినేపల్లి విద్యుత్ శాఖ ఎఇ పేర్ని రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తడిసిన కరెంట్ స్తంభాలు, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్లకు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. పార్కులలో గాని, స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రానీయకుండా చూసుకోవాలన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదని, గాలి దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదన్నారు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్ల పెట్టిన వస్తువును ముట్టుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు 'డిష్ కనెక్షన్' తీసివేయాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు టివి, ఫ్రిడ్జ్, వాటర్ మోటర్స్, కంప్యూటర్‌ల లిస్విచ్‌లను ఆఫ్ చేయాలని, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కరెంటు లైన్ల కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఎప్పటికప్పుడు డ్యామేజ్ అయినచో వెంటనే సంబంధించిన అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి కరెంటు వస్తువుకు 'ఎర్త్' తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ఎవరైనా వ్యక్తులు మీ ప్రాంతంలో ఎటువంటి విద్యుత్ చౌర్యమైన ప్రజల దృష్టికి వచ్చినట్లయితే వెంటనే 9440812171కు ఫోన్ ద్వారా తమ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. అలా తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎఇ పి.రవికుమార్ వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దెందులూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరా అయ్యేలా ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గుత్తా అనిల్ పేర్కొన్నారు. శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక హైస్కూలులో విద్యార్థులకు భోజనాలు నిర్వహించారు. టిడిపి అధికార ప్రతినిధి గుత్తా అనిల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. మధ్యాహ్న భోజన కార్యక్రమంలో చక్కెర పొంగలి పెట్టమని సరసం శాస్త్రి రిటైర్డు పోస్టు మాస్టర్ భోగరాజు రామ్మోహన్ రావు రూ.4 వేల సాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్ష సప్తాహ తిథి భోజన్ కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శిక్ష సప్తాహ శుభ దిన్ తిథి భోజన కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవాడ వాస్తవ్యులు శోభనాచల గుప్తా విద్యార్థులకు అరటిపళ్లు అందజేయగా, ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి చిట్నేని విజయ శేషగిరిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలకు ఏర్పాటు చేశారు. అమ్మవారిగూడెం ఎంపిపి పాఠశాలలో జలసూత్రం సత్యనారాయణ విద్యార్థులకు అరటిపళ్లు, పెరుగు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.పుష్పలత, టి.ప్రసాద్, ఉపాధ్యాయులు వంశీ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: జాతీయ విద్యావిధానం దినోత్సవం సందర్భంగా శిక్షాసప్తాహ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అప్పలరాజుగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గన్నిన సురేంద్ర నాథ్ చౌదరి, మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో మాజీ ఎంపిపి కొత్త సురేఖల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు సోమవారం శుభదిన భోజనం(పౌష్టికాహారం) అందించారు.

మండలంలోని బండివారిగూడెం ఎంపియుపి పాఠశాలలో హెచ్ఎం డి.బాజా ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం దినోత్సవం శిక్షాసప్తాహ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి నాళం శిరీషా, కాశి దంపతుల సహకారంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు.

ముసునూరు: అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో సోమవారం శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధికా రాణి తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం పాఠశాలలో రోజువారీ మధ్యాహ్నం భోజనంతో పాటు దాతల సహాయంతో 243 మంది విద్యార్థులకు గొల్లపల్లి గ్రామస్తులు గోగినేని మధు, నాన్ టీచింగ్ సిబ్బంది అరటిపళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోగినేని మధు సతీమణి లక్ష్మి, పల్లగాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్‌పిహెచ్ఎస్ ముసునూరు పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం సహపంక్తి భోజనాలు ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక గ్రామానికి చెందిన తుమ్మల మధులత సహకారంతో 400 మంది విద్యార్థులకు అరటిపండ్లు, పెరుగన్నం, స్వీటు, చాక్లెట్లు ఏర్పాటు చేశారు.

దెందులూరు: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అనిల్

చాట్రాయి: జాతీయ విద్యా విధానం 2020 ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 23వ తేదీ నుంచి 29 వరకు నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు అయిన సోమవారం దాతల సహాయంతో విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేసి 'శుబ్ దిన్ తిథి భోజన' కార్యక్రమాన్ని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల హెచ్ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కలిదిండి : విద్యా వారోత్సవాల్లో బాగంగా ఆఖరి రోజైన సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో దాతల సాయంతో ఏర్పాటు చేసిన భోజనాల్లో పండ్లు, స్వీట్స్‌తో పాటు ప్రతి రోజూలానే మెనూను విద్యార్థులకు అందజేసినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. ఆరుతెగలపాడులో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశపు హాలులో జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు అంతా తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ప్లాంటేషన్ల వద్ద పటిష్ట నిఘా

స్క్వాడ్ డిఎఫ్ఒ త్రిమూర్తులు రెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా ప్లాంటేషన్ వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అటవీ శాఖ నిఘాబృందం డిఎఫ్ఒ త్రిమూర్తులు రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని జంగారెడ్డిగూడెం రేంజ్ ములగలంపల్లి సెక్షన్, కామయ్యాపాలెం, రాచన్నగూడెం బీట్ పరిధిలో గత సంవత్సర కాలంలో నాటిన మారుజాతి మొక్కల ప్లాంటేషన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలకు సంబంధించిన ఎమ్ బుక్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ పరిధిలో ఉన్న సంపదను అన్యాక్రాంతం కాకుండా ప్లాంటేషన్‌ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం సరిహద్దు గుండా ఉన్న అటవీ శాఖ తనిఖీ కేంద్రంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. సరిహద్దు చెక్‌పోస్ట్ కావడంతో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ బృంద సభ్యులు, బీట్ అధికార్లు మారెష్, పాపరెడ్డి, యేసు పండు, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు, రహమత్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

సిడిపిఒ నూరాని

ప్రజాశక్తి - ముసునూరు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలంటే ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉండాలని సిడిపిఒ ఎస్కె నూరాని పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు వెలుగు కార్యాలయంలో అంగన్వాడీలు, నాన్ ఉపాధ్యాయ సిబ్బందితోపాటు కొందరు తల్లులకు వందరోజుల మహిళల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ నూరాని మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక ఇబ్బంది వున్న సమయంలో 181 నెంబర్‌కు డయల్ చేయాలని, చిన్నపిల్లలు అయినట్లయితే 1098 అనే నెంబరుకు డయల్ చేసి వారు ఆ ఇబ్బందులు ఉన్న పరిస్థితిని ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని, మహిళా చట్టాలు ఎన్ని వచ్చినా మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్స్ కె.ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఏ సాగుకైనా విత్తనశుద్ధి తప్పనిసరి

జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.లలితసుధ

టి.నరసాపురం: రైతులు ఏ పంట సాగు చేసినా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.లలిత సుధ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో రైతు సేవాకేంద్రంలో సోమవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరిపంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమగ్ర యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లలితసుధ మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న వాతావణ మార్పులకు అనుగుణంగా పంటసాగు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. రైతులు విత్తన శుద్ధి చేసిన విత్తనాలనే వినియోగించాలని తెలిపారు.

ఘనంగా హరిశ్చంద్ర ప్రసాద్, జెఆర్‌డి టాటా జయంతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్ సిఆర్ రెడ్డి కళాశాల సిఐఐఇ, ఇడిసి, ఎంబిఎ, ఐక్యూ ఎసి వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పారిశ్రామికవేత్త, ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 103వ జయంతి, టాటా గ్రూపుల వ్యవస్థాపక అధ్యక్షులు భారతరత్న జెఆర్‌డి టాటా 120వ జయంతిని సిఆర్ రెడ్డి కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త అంబికా సంస్థల ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ అయిన అంబికా కృష్ణ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార అభివృద్ధికి ఎనలేని సేవలను అందించి, దేశ ఆర్థికవ్యవస్థ మరింత పటిష్టంగా ముందుకు సాగటానికి పునాదులు వేసి దిశానిర్దేశం చేసిన మహనీయులలో ఈ ఇద్దరి పారిశ్రామికవేత్తల పాత్ర చాలా ముఖ్యమైన భూమిక పోషిస్తుందన్నారు. వీరు చూపిన మార్గదర్శకాన్ని ప్రతి పారిశ్రామికవేత్త ఆదర్శంగా తీసుకుని అవలంభిస్తే దేశం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించి తీరుతుందని, ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ అనుబంధ వ్యాపారవేత్తలు, అలాగే సేవారంగ సంస్థలు నైతిక విలువలతో కూడిన వ్యాపారసేవలను కొనసాగించాలని, ముఖ్యంగా ఈనాటి విద్యార్థులు, యువతీయువకులు ఇలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, భారతరత్న జెఆర్‌డి టాటా చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్ సిఆర్ఆర్ విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ, డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి కరస్పాండెంట్ కొడాలి సుబ్బరావు, పిజి కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస రావు, మేనేజ్మెంట్ సభ్యులు కె.సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎరామరాజు తదితరులను సన్మానించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిసిసి అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గిరిజన సహకార సంస్థ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తూ సక్రమంగా విధులకు హాజరుకాకుండా గత మూడు రోజులుగా ఇంటి వద్ద ఉంటున్న బాబురావుపై చర్యలు తీసుకోవాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు గోదావరి వరదలు మండలాన్ని చుట్టుముట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి సమయంలో వరద బాధితులకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసే జిసిసిలో పనిచేసే ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి పరిస్థితులలో జిసిసిలో పనిచేసే సదరు అకౌంటెంట్ విధులకు సక్రమంగా హాజరు కాకుండా ఇంటి వద్ద ఉంటున్నారని ఆరోపించారు. కుక్కునూరు జిసిసిలో పనిచేస్తున్న బాబురావు అకౌంటెంట్ గోడౌన్ ఇన్‌ఛార్జిగా పనిచేయాల్సి ఉండగా గోడౌన్ ఇన్‌ఛార్జిగా రిటైర్డ్ అయి ఉన్న వేరే వ్యక్తితో పనిచేపిస్తూ తాను మాత్రం అకౌంటెంట్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడని, ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి తన ఇష్టం వచ్చినట్లు చేస్తూ గత మూడు రోజులుగా విధులకు గైర్హాజరవుతున్న విషయంపై స్థానిక జిసిసిలో ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు బాబురావుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, చేనేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్‌కు చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు, సొసైటీలకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడిన డబ్బు చెల్లించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో చేనేత సహకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేల వరకూ పెంచాలని, సొంత మగ్గం నేసే వాళ్లతో పాటు అద్దె మగ్గాలు నేసే వారికి కూడా నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

చేనేతపై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి చేనేత కార్మికులకు చేనేత పరికరాలను ఉచితంగా అందించాలని ఆయన కోరారు. చేనేతకు రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలని, జౌళి శాఖ నుంచి చేనేతను విడదీయాలని కన్నయ్య కోరారు. చేనేత వస్త్ర ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వమే మార్కెటింగ్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

ఉంగుటూరు : రైతాంగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులు దగ్ధం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం కైకరంలోని తూర్పు వీధి రామాలయం సెంటర్‌లో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గెద్దలకు పెట్టేలా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులు కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడం ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. కార్యక్రమంలో చిత్తా వెంకటేశ్వరరావు, అల్లు గోవిందు, జె.శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు, కె.నూకరాజు పాల్గొన్నారు.

లైసెన్సు లేని షాపుల తనిఖీ

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో మాదల బెనర్జీకి చెందిన క్రిమిసంహారక మందుల షాపును జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కరణం కుమార్, రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి లైసెన్స్ లేకుండా క్రిమి సంహారక మందులు, ఎరువులు అమ్ముచున్నట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం ప్రకారం తుమ్మగూడెం గ్రామంలో మాదల బెనర్జీ గోడౌన్ నందు సంయుక్తంగా తనిఖీ చేసి రూ.1,27,279 విలువ కలిగిన 59.36 క్రిమి సంహారక మందులు గుర్తించారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బొద్దేపల్లి

ఉంగుటూరు: ఉంగుటూరు తహశీల్దార్ కట్టా శివయ్య రిలీవ్ అవ్వటంతో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న బొద్దేపల్లి దుర్గాప్రసాద్‌కు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సమయంలో ఉంగుటూరు తహశీల్దార్‌గా శివయ్య ఇక్కడ పనిచేశారు. ప్రభుత్వం ఎక్కడ వారిని అక్కడికే బదిలీ చేసిన క్రమంలో భాగంగా శివయ్య బదిలీ అయ్యి సోమవారం రాత్రి రిలీవ్ అయ్యారు. డిటి కిరణ్మయి, పోతురాజు, కార్యాలయం ఉద్యోగులు శివయ్యను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అందరి సహకారంతో ఇక్కడ పనిచేయటం చాలా సంతోషంగా ఉందని శివయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యాలయం ఉద్యోగులు శివయ్యను సన్మానించారు.

తీజ్ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

శాస్త్రీయ జీవన సంస్కృతి పండుగే తీజ్ మహోత్సవమని బంజారా బజరంగీ సంఘ ప్రధాన కార్యదర్శి భుక్య వేణుగోపాల్ అన్నారు. బంజారా బజరంగీ భేరి సంఘ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాపురంలో సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తీజ్ మహోత్సవం ప్రచార పోస్టర్‌ను, కరపత్రాన్ని మహిళల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ బంజారా ప్రజల జీవన సంస్కృతి ప్రకృతిసిద్ధమైన పండుగలతో, శాస్త్రీయమైన ఆలోచనలతో మిళితమై ఉంటుందన్నారు. బంజారా ఆడపిల్లల కలల పండుగయే తీజ్ మహోత్సవమని తెలిపారు. సంఘ కోశాధికారి ధరావత్ రవి మాట్లాడుతూ తీజ్ పండుగ జరపడంలో ముఖ్య ఉద్దేశ్యం పాడి పంటలతో, సిరిసంపదలతో గ్రామాలు కళకళలాడేలా చేయడమని అన్నారు. తీజ్ ఉత్సవ కమిటీ నాయకురాలు భూక్యా రామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తీజ్ ఉత్సవంను కృష్ణాపురం గ్రామంలో ఆగష్టు 18 నుంచి 26 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భూక్యా సురేష్, ధరావత్ బంగారయ్య పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ నివాసి మెండి వెంకటలక్ష్మీ, W/o మెండి దుర్గాప్రసాద్ అను నేను ది.25-07-2024వ తేదీన కైకరం నుండి ఉంగుటూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క పాస్‌పోర్టు పోయినది. నా **ఒరిజినల్ పాస్‌పోర్టు నెం: X1037239** కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మెండి వెంకటలక్ష్మీ
W/o: మెండి దుర్గాప్రసాద్
కైకరం, ఉంగుటూరు మండలం
Mobile: 8886555198

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.25/2022 in O.S.No.189/2015
DHR/వాది : ముత్యాల ఏడుకొండలు
JDR/ప్రతివాది : చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త
JDR/ ప్రతివాది : చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త, S/o.పెద్దకేశవరావు, డోరునెం.2-29-2, ఉప్పులూరు, ఉండి మండలం, ప.గో.జిల్లా.
పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు ది.20-08-2024 సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
భీమవరం, కె.వి.రమేష్, పెన్నాడ.
27-7-2024 వాది తరపు న్యాయవాది.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.134/2021
వాది : నందమూరి పార్వతి
ప్రతివాదులు : బొర్రానపల్లి అప్పారావు వగైరా
8వ ప్రతివాది : బొర్రానపల్లి రూప, D/o.అప్పారావు, R/o.తోకలపూడి, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.
10వ ప్రతివాది : బొర్రానపల్లి నానిబాబు, S/o.అప్పారావు, తోకలపూడి, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.
పై నెంబరు దావా గ్రంథము నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు ది.08-08-2024 సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
భీమవరం, కె.వి.రమేష్, పెన్నాడ.
27-7-2024 వాది తరపు న్యాయవాది.

మహారాజశ్రీ భీమవరం సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.233/2022
Between:
తాడేపల్లి వెంకటేశ్వర్లు ...వాది
And
తాడేపల్లి వెంగప్ప వగైరా ...ప్రతివాదులు
2వ ప్రతివాది : శ్రీమతి తాడేపల్లి నాగమ్మ, భర్త : లేటు నాగులు, వయస్సు 60 సం.లు, హిందు, స్త్రీ, మానవరం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. TCJ(Jr.D.)Court.
4వ ప్రతివాది : శ్రీమతి [illegible] వరలక్ష్మి అనే [illegible], భర్త: మురళీకృష్ణ, తండ్రి: లేటు నాగులు, వయస్సు 32 సం.లు, హిందు, స్త్రీ, మానవరం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. TCJ(Jr.D.)Court.
వాది తరఫున దాఖలు చేసిన పత్రికా ప్రకటన
పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయుచున్నది. కావున, మీరు పై కోర్టు వారి యెదుట ది.13-8-2024 ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేని యెడల, మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయుచున్నది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపర్ ప్రకటన ఇవ్వబడినది)
భీమవరం, కోటి వెంకట్రామయ్య,
ది.29-07-2024 అడ్వకేట్, కోర్టు
సెల్: 9849356866.